

హామ్మయ్య, యీ కథ వ్రాయడం యిప్పటికి పూర్తయింది — అంటూ ఒక్క నిట్టూర్పు విడిచాను. ఇక ఆనవాయితీగా వ్రాయవలసినది వ్రాయడం మొదలుపెట్టాను. ఈ రచన నా స్వంతమేనని యిందు లిఖితపూర్వకముగా తెలియ జేయుచున్నాను. ఈ కథ దేనికీ అనువాదమూ, అనుసరణా కాదు. ఈ రచనను మీరు ప్రచురించని యెడల నాయందు దయవుంచి, నేను పంపు నా స్వంత చిరునామా గల కవరునందు త్రిప్పి పంపగలరు.

ఇట్లు,
సుజన.

ఇక యీ సుపుత్రికను అత్తవారింటికి పంపే సన్నాహాల్లో మునిగిపోయాన్నేను. నా భావానికి రూప కల్పన చేయడం, దాన్ని "పువ్వులరాణి" వారపత్రికను పంపడం సక్రమంగా జరిగిపోయాయి. ఇక ఆ కథ ప్రచురణకై పట్టువదలని విక్రమార్కుడిలా కూర్చున్నాను ఎదురుచూస్తూ —

*    *    *

"పోస్ట్!"

చదువుతున్న నవలక్కడే పారేసి, ఒక్క గంతులో పోస్ట్‌మెన్ వద్దకు దూకాను. పత్రిక చూడగానే నాలోని ఆనందం సముద్ర కెరటాల్లా ఎగిసిపడ సాగాయి. వెంటనే ఆ పత్రికలో ప్రచురితమైన నా కథను ఎన్నిసార్లు చదివానో నాకే తెలియదు. మావారందరూ ఒకటే పొగిడెయ్యటమే.

"డాడీ! డాడీ!!"

"వాట్, సుజనా? వాట్ హేపెండ్?"

"మొట్టమొదటిసారిగా నా కథ అచ్చయింది డాడీ!"

"ఏమిటీ, నీ కథ అచ్చయిందా? వెరీగుడ్, మై సుజనా యూ ఆర్ ఎ గ్రేట్ రైటర్! సుజనా మన భారతదేశంలో వున్న రచయిత, రచయిత్రు లందరినీ తలదన్నేటటువంటి రచనలు చేయాలి... చేసితీరాలి. విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!" అంటూ నాన్నగారు నన్ను కొండెక్కించేసారు.

రెండు వారాల తర్వాత —

"సుజనా! సుజనా!!" అంటూ గోల చేయ సాగింది చెల్లాయి.

"ఏమిటే, ప్రొద్దుటే నీ గోల?" చిరాకు పడసాగాన్నేను.

"గోలంటావేమిటె పీ. తలకాయ్, యిది చూడు!" అంటూ ఉత్తరాల శీర్షికలో పాఠకుల ఉత్తరాలు చూపించింది.

మొదటి ఉత్తరం చదివిన నా మనస్సు ఒక్కసారి గతుక్కుమంది. పాతాళంలోకి కృంగిపోయే

ఉత్తరం చదవసాగాను.

రచయిత్రి సుజనగారు వ్రాసిన "ఆశ్చర్యం" కథ చాల బాగుంది. వాస్తవానికి అతిదగ్గరగా వుంటూ, నేటి సమాజంలో జరిగే, జరుగుతున్న నగ్న సత్యాలను నగ్నంగా చూపెట్టిన ప్రతిభ అతి ప్రశంసనీయంగా వుంది. "రచయిత్రి"కి మా అభినందనలు.

గియ్యాళి గౌరమ్మ,
గంపలగూడెం.

ఈ వారం ముఖచిత్రం అతి సుందరంగా వుంది. ముఖ్యంగా కథలోకెల్లా "ఆశ్చర్యం" కథ మా మనసుల్ని కదలించివేసిందంటే అతిశయోక్తి కాదు అటు హాస్యంతో, యిటు విషాదంతో కథ చక్కగా వుంది. కథ నడిపిన తీరులో నవ్యత గోచరించింది. రచయిత్రిగారు బహు ప్రశంసనీయముగా రూపకల్పన చేసారు. భవిష్యత్తులో చాల అభివృద్ధిలోనికి రాగల రచయిత్రి యీమె!

అబద్దాల అప్పారావు,
అజ్ఞాతపురం.

ఈ రెండు వుత్తరాలు చదివేసరికే నా తల తిరిగిపోసాగింది. బరువెక్కిన హృదయంతో మూడో వుత్తరం చదవసాగాను

మా యింటిల్లిపాదినీ ఆశ్చర్యంలో ముంచెత్తిన "ఆశ్చర్యం" కథ చాల ఆశ్చర్యంగా వుంది. కథ చివరలో అలా మలుపు తిరుగుతుందని మేమెవరమూ వూహించలేదు. ఈ వారం "ఆశ్చర్యం" కథ మీ (మా) పత్రికకే హైలైట్. రచయిత్రి సుజనగారు చాల బాగా వ్రాయగలిగారు. ఆమె వూహకు దర్పణం పట్టినట్టుందీ కథ. రచయిత్రికి మా అభినందనలు.

ముక్కోపి ముకుందం,
మూడుచెఱువులపాలెం.

"అయ్యబాబోయ్, యీ పాఠకులందరూ నా కొంప ముంచేసారు!" అంటూ తల పట్టుకుని ఏడ్వసాగాను. ఎక్కడ చూసినా రచయిత్రి... రచయిత్రి అంటూ ఆకాశాని కెత్తేస్రా బాబూ - నెత్తి నోరూ మొత్తుకుంటున్న నాకు చెల్లాయ్ అభయమిస్తున్నట్లుగా నా కన్నీరు తుడిచి –

"సుజనా! నీ కెందుకు, నీ మొట్టమొదటి కథకే యింత పబ్లిసిటీ వచ్చిందే! యింకేం, బోలెడన్ని కథలు వ్రాసెయ్, నీ పేరు ఆంధ్రదేశం అంతటా మ్రోగిపోతుంది. 'రచయిత్రి' సంగతంటావా, నీకేం ఫర్వాలేదు కాలమే అన్ని సమస్యల్ని పరిష్కరిస్తుంది. కథలూ, నవలలూ, వ్యాసాలు వ్రాసెయ్, యిదివరకు వ్రాసిన పాత చెత్తంతా బయటకి తియ్. వాటన్నిటినీ ఫెయిర్ చెయ్యి, పేరు తెచ్చుకో, విష్ యు బెస్ట్ ఆఫ్ లక్ –" చెల్లాయి మాటలతో మరల నాలో చైతన్యం పరవళ్ళు త్రొక్కింది. నిజమే మానవులు పరిష్కరించలేని సమస్యల్ని ఆ కాలమే పరిష్కరిస్తుంది – అనుకున్నాను.

ఇక నా కలం విజృంభించింది. నాలో ఆవేశం ఉప్పొంగిపోయింది. అగ్గిపుల్ల దగ్గర్నుండి స్మగ్లింగ్ వరకూ నాకు కథావస్తువులే! బోలెడన్ని కథలు వ్రాసేసాను. నవల్సు వ్రాయడం మొదలుపెట్టాను. ఆంధ్రదేశం అంతటా మారుమ్రోగిపోసాగింది. కాని నా గుండెల్లో ఎందుకో ఒక మూల నుండి భయం, బెరుకు తొంగి చూస్తూనే వున్నాయి.

ఒక మంచి నవల వ్రాసి దీపావళి కథల పోటీకి "నవ్వుల వాణి" ప్రముఖ వార పత్రికకు పంపాను. ఎప్పుడు చూసినా అదృష్టం కాలికే తగులుతుంది. నా నవల "ఎదురు చూడని అదృష్టం"కు మొదటి బహుమతి వచ్చినట్లు పత్రికలో చూసిన నా మనస్సు ఆనంద డోలికలలో తేలియాడిపోసాగింది. మా యింటిల్లిపాదీ ఆనంద రసాబ్ధిలో మునిగిపోయారు.

ఇంతలో ఎడిటర్‌గారి దగ్గర్నుండి లెటర్ వచ్చింది.

రచయిత్రి సుజనగార్కి!

మీ నవల 'ఎదురు చూడని అదృష్టం'కు మొదటి బహుమతి ఐదువేల రూపాయలు వచ్చినట్లు తెలియజేసాము. అందుకు మేమెంతో సంతోషిస్తున్నాము. మీ ఫోటో, జీవిత విశేషాలు పంపితే ప్రచురిస్తాము.

ఇట్లు,
ఎడిటర్.

ఈ లెటర్ చూడగానే నా గుండెల్లో రాయి పడింది. గుట్టు బట్టబయలవుతుందేమోనని గుండె దడదడలాడసాగింది. ఆఖరికి ధైర్యంచేసి మరల ఎడిటర్‌గార్కి రిప్లయ్ వ్రాసాను.

> వ్యక్తులపేర మీ రచనలు పంపితే వాటి పరిశీలనలో ఆలస్యం జరిగే ప్రమాదాలెక్కువ కనుక మీ రచనలన్నీ కూడా శీర్షిక పేరు కవరుపైన లేదా కార్డుపైన ఉదాహరిస్తూ సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ - 520003 అన్న చిరునామాకి పంపండి. సం

ఎడిటర్‌గార్కి,

నా నవలకు ప్రథమ బహుమతి వచ్చినందులకు చాల సంతోషం. కానీ మీరు ఫోటో, జీవిత విశేషాలూ పంపమన్నారు. నేను యిప్పుడిప్పుడే అభివృద్ధిలోకి వచ్చుచున్నాను. ఇంత తొందరలో నన్ను నేను పరిచయం చేసుకోవడము నాకు యిష్టం లేదు. కావున నేను మీ కోర్కెను అంగీకరించనందులకు చాల విచారిస్తున్నాను.

ఇట్లు,
సుజన.

ఇలా యీ గండం గడిచినందుకు శతకోటి దేవతలకు ప్రార్థన చేసాను.

కాలం అనేది ఎవరికోసమూ ఆగదు. ఆ కాల ప్రవాహినిలో రచయిత్రి సుజనగా నాపేరు మరింత వ్యాపించింది. ఏ పత్రికలో చూసినా పాఠకులందరూ నా ఫోటో కోరేవాళ్ళే!

ఉగాది నవలల పోటీకి మరొక నవలను పోటీకి పంపాను. ఆ నవల పేరు "బయల్పడిన నిజం"– ఒక ప్రముఖ వార పత్రికకు పంపడం, నా జాతకం బాగుండి దానికి ద్వితీయ బహుమతి రావడం జరిగింది.

ఈ సారి యీ ఎడిటర్ దగ్గర్నుండి నా 'ఫోటో' కొరకై కొంచెం ఘాటైన ఉత్తరమే వచ్చింది. ఈ సారి నా పాస్‌పోర్టు సైజు ఫోటో పంపక తప్పింది కాదు. ఆ ఫోటో పంపినరోజు నుండి నా గుండెలు లబ్ డబ్ అనడం పోయి దడ...దడా – దడ...దడా కొట్టుకొనసాగాయి.

* * *

యథాలాపంగా పత్రిక తిరగవేస్తున్న నాకు - నా కళ్ళు ఒక చోట నిల్చిపోయాయి. నెమ్మదిగ చదవసాగాను –

"పాఠకలోకాన్ని అత్యంతాశ్చర్యంలో ముంచెత్తే గొప్ప నగ్న సత్యం"– వచ్చేవారం పత్రికకై ఎదురు చూడండి –

"ఏంటబ్బా యీ నగ్న సత్యం ?" నా మనస్సు పరిపరి విధాల పోసాగింది. కొంపదీసి మన విషయమే కాదుగదా! వచ్చేవారం పత్రికకై ఎదురు చూడసాగాను.

రానే వచ్చింది ఆరోజు – గబగబా పేజీలు తిరగవేస్తున్న నేను – పాఠకలోకాన్ని ఆశ్చర్యములో ముంచెత్తే గొప్ప నగ్న సత్యం – రచయిత్రి (త) సుజనగారి ఫోటో, జీవిత విశేషాలు 34వ పేజీలో చూడండి!

నా గుండె గతుక్కుమంది. మెదడు మొద్దుబారిపోయింది. వెంటనే గబగబా 34వ పేజీ తెరిచాను. "ఆఁ" ఒక్కసారిగా మూర్ఛ వచ్చినంత పనైంది నాకు. యిలా జరుగుతుందని ముందే తెలిసినా 'నగ్న సత్యం' కళ్ళముందు కనబడేసరికి మతిపోయింది.

నాదే ఆ ఫోటో – నవ్వులు చిందించే అందమైన టీనేజ్ అబ్బాయ్!

"జీవిత విశేషాలు! సుంకర జక్కా నరశింహం అనబడే యీయన కలంపేరే 'సుజన' యింతకాలం పాఠకలోకం 'రచయిత్రి'గా భ్రమసే యీయన 'రచయిత'నే నిజం యిప్పుడే బయల్పడింది. యీయన వ్రాసిన "బయల్పడిన నిజం" నవల యీ వారం నుండే ప్రచురిస్తున్నందుకు సంతోషిస్తున్నాము. ఈయన యింకా..." యిక ఆ పైన చదవలేకపోయాను.

నా మనస్సు ఒక్కసారి గతంలోకి పరుగెట్టింది. కథలు వ్రాసీ...వ్రాసీ ఎన్నో పత్రికలకు పంపేవాడిని. ఒక్కటీ అచ్చయ్యేదికాదు. చివరికి విసిగిపోయి నాపేరునే సింపుల్‌గా 'సుజన'గా పెన్‌నేమ్ పెట్టి కథ పంపడం, అది అచ్చవ్వడం జరిగిపోయింది. నేనెక్కడా 'రచయిత్రి'నని పాఠకులకుగానీ, ఎడిటర్లకుగానీ చెప్పడం, వ్రాయడం జరగలేదు. ఆ పేరునుబట్టి వాళ్ళే రచయిత్రిని చేసేసారు నన్ను. మా యింట్లో వాళ్ళందరికీ 'సుజన' అని పిలవడం అలవాటయిపోయింది.

* * *

హరి భగవంతుడా, యీ పాఠకులందరూ నానా తిప్పలుపడి పెట్టారుకదరా, మళ్ళీ దీనిపై ఏం విమర్శలు వస్తాయో ఎదురు చూడొద్దూ!

"సుజనా! నీ సీరియల్ 'బయల్పడిన నిజం' చాల బాగుందిరా!" అంటూ వచ్చింది చెల్లాయ్! ●